సాక్షి పల్నాడు

ఆదివారం । 26 । నవంబర్ । 2023



పాఠశాల వాహనాలపై కేసు

పట్నంబజారు: జిల్లా రవాణా శాఖ అధికారులు శనివారం గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. 12 ఆటోలు, రెండు స్కూలు బస్సులపై కేసు నమోదు చేశారు.



ఘనంగా శోభాయాత్ర

అమరావతి: అయోధ్య నుంచి శ్రీరాముని పూజించిన అక్షింతల కలశానికి శనివారం అమరావతిలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

నేడు అమరేశ్వరుని తెప్పోత్సవం




అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలో కార్తికపౌర్ణమి సందర్భంగా ఆదివారం అమరేశ్వరునికి వైభవంగా తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్తికపౌర్ణమి పర్వదినాన అమరేశ్వరాలయాన్ని సందర్శించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా క్రమ పద్ధతిలో క్యూలైన్లను ఏర్పాటుచేసి పోలీస్‌శాఖ సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ, దేవాలయం, స్నానఘాట్‌లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం, సుమారు 50వేల లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్నామన్నారు. ఆదివారం రాత్రికి స్వామి వారి గ్రామోత్సవం, అనంతరం కృష్ణానదిలో వైభవంగా తెప్పోత్సవం, జ్వాలాతోరణం ఉత్సవం నిర్వహించటానికి వివిధ ప్రభుత్వశాఖలతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

డిసెంబర్ 13లోగా దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారిత కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు డిసెంబరు 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ పీడీ బి.అరుణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలల సంరక్షణ యూనిట్ (డీపీయు)లో 12 పోస్టులు, శిశు సంరక్షణ కేంద్రంలో 11 పోస్టులు (కేవలం మహిళలకే), పిడుగురాళ్లలోని చిల్డ్రన్స్ హోమ్‌లోని ఎనిమిది పోస్టులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ పద్ధతి ప్రకారం భర్తీచేయబడతాయన్నారు. అభ్యర్థులు ఈ ఏడాది జూలై నాటికి 18 ఏళ్ల నుంచి 42 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు నరసరావుపేటలోని కార్యాలయానికి తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 4,034, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 839.30 అడుగుల వద్ద ఉంది.

భూములకు వైఎస్సార్ జలకళ

- రైతుల భూముల్లో ఉచితంగా బోర్లు
- బీడు భూముల్లో సైతం సాగు
- ఉచితంగా విద్యుత్ కనెక్షన్, మోటార్లు, సోలారు పరికరాలు
- ఏడాదిలో రెండు పంటలకు అవకాశం
- ఆనందంతో నిరుపేద రైతులు



పంపిణీకి సిద్ధంగా ఉన్న విద్యుత్ సబ్‌మెర్సిబుల్ మోటార్లు

అచ్చంపేట: నీటివసతి లేక, వేలాది రూపాయల ఖర్చుతో బోర్లు వేసినా నీటి చుక్క పడకపోవడంతో చాలా మంది రైతులు తమ భూములను బీడులుగా వదిలేశారు. అలాంటి రైతులకు వైఎస్సార్ జలకళ పథకం వరంలా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఈ పథకం ద్వారా ప్రభుత్వమే ఎన్ని అడుగులైనా రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా బోరు వేయించడమే కాకుండా, బోరు వరకు ఎన్ని స్తంభాలు పడితే అన్నీ వేసి అందుకు కూడా పైసా ఖర్చు లేకుండా విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు. అంతటితో ఆగకుండా నాణ్యమైన సబ్ మెర్సిబుల్ విద్యుత్ మోటారు, అందుకు అవసరమైన సోలార్ పరికరాల మొత్తాన్ని రైతు చెంతకు చేరుస్తున్నారు.

జలకళకు 190మంది రైతులు అర్హులు

అచ్చంపేట మండలంలో జలకళ పథకం ద్వారా బోర్లు కావాలని 202 మంది రైతులు దరఖాస్తు చేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవతో 190మందిని అర్హులుగా నిర్ధారించారు. వీరందరికి బోర్లు వేయించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వీరిలో 43మంది రైతులకు 300 నుంచి 400లకు పైగా అడుగుల లోతులో బోర్లు వేశారు. వారిలో 24 మందికి బోరు వరకు విద్యుత్ లైను వేశారు. ప్రస్తుతానికి 13 మందికి పూర్తిస్థాయిలో వైఎస్సార్ జలకళ పథకాన్ని అందచేశారు. మరో 30మందికి ఇచ్చేందుకు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మిగిలిన వారందరికి విడతల వారీగా బోర్లు సరఫరా చేస్తామన్నారు. మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు నిరుపేద రైతులకు, చింతపల్లిలో ఇద్దరు, వేల్పూరులో ఇద్దరు, గ్రంథశిరి, కొత్తపల్లి, చల్లగరిగ, మాదిపాడు గ్రామాలలో ఒక్కొక్కరి చొప్పున పూర్తిస్థాయిలో బోర్లు వేసి, విద్యుత్ కనక్షన్లు ఇచ్చి, సబ్‌మెర్సిబుల్ మోటార్లు బిగించారు.

ఒక్కొక్క రైతుకు రూ.13లక్షలు వెచ్చించిన ప్రభుత్వం

బోరు వేసినందుకు రూ.50వేలు, విద్యుత్ లైన్‌కు మరో రూ.50వేలు వెచ్చించారు. ఒక్కొక్క రైతుకైతే 20వరకు విద్యుత్ స్తంభాలు అవసరమయ్యాయి. అయినా ప్రభుత్వం వెనకాడలేదు. స్తంభాలు, విద్యుత్ తీగెలు మొత్తం విద్యుత్ శాఖ నుంచే సరఫరా చేశారు. ఐదెకరాల భూమికి ఒక 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. దీని విలువ సుమారు రూ.1.50లక్షలు. బోర్లు వేసిన రైతులందరికీ విద్యుత్ సబ్‌మెర్సిబుల్ మోటార్లు, అందుకు కావలసిన పంప్‌సెట్స్, త్రీకోర్ కాపర్ కేబుల్స్, హెచ్‌డీఈ పైపు, ప్యానల్ బోర్డ్స్, రీవైరబుల్ ఫీజుయూనిట్స్, ఎర్తింగ్ అరేంజ్‌మెంట్ కిట్స్, రెడ్యూసర్స్, స్టాండ్స్ సమస్తం ఇచ్చారు. ఇందుకుగాను ఒక్కొక్క రైతుకు సుమారు రూ.13లక్షలు వెచ్చించారు.

ఏకంగా 16విద్యుత్ స్తంభాలు వేశారు



మెయిన్‌లైను నుంచి నా భూమికి సుమారు కిలోమీటరుకు పైగా దూరం ఉంది. 16 విద్యుత్ స్తంభాలు వేశారు. వైర్లు, కాసారాలు అన్ని విద్యుత్ శాఖే భరించింది. ఎవ్వరికి నేను ఒక రూపాయి ఇవ్వలేదు. నేను కలలో కూడా అనుకోలేదు. ఇన్నాళ్లు భూమి ఉన్న నిరుపేదను. ఇకపై భూమి ఉన్న రైతును అని సగర్వంగా చెప్పుకుంటా. జన్మ జన్మకు ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటా.

– కత్తుల చంద్రయ్య, రైతు, చెరుకుంపాలెం

ఇదంతా ముఖ్యమంత్రి దయే..



మా పొలంలో బోరు వేయించుకుకోవడం, విద్యుత్ కనెక్షన్ రావడం, మోటార్లు బిగించి, నీళ్లు రావడం అంతా ఒక కలలా జరిగిపోయింది. ఇంత ఖర్చుతో మేమైతే వేయించుకోలేం. ఇదంతా ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి దయే, ఆయన మేలును జన్మజన్మలకు మరువలేము. ఇక నుంచి వ్యవసాయం చేసుకుని ఆనందంగా జీవిస్తాం.

– గొర్రెపాటి కుమారి, మహిళా రైతు, మాదిపాడు

రెండు పంటలు పండుతాయి



నేనేంటి.. నా పరిస్థితేంది. నా పొలంలో బోరు వేయించుకోవడం నా వల్ల అవుతుందా.. ముఖ్యమంత్రి జగన్ దయవల్లే నా భూమికి మంచి విలువ వచ్చింది. యేడాదిలో రెండు పంటలు పండించుకునే అవకాశం వచ్చింది. ఇలాంటి ముఖ్యమంత్రి ఏ రాష్ట్రంలోనూ ఉండరు. ఇలాంటి సీఎం ఉంటే నా లాంటి నిరుపేదవాళ్లు కూడా లక్షాధికారుల్లా బతుకుతారు.

– చిత్తూరి జానకిరామయ్య, వేల్పూరు

రాజ్యాంగ పీఠిక, ప్రాథమిక విధులపై బోర్డులు

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వినూత్న చర్యలకు జిల్లా కలెక్టర్ ఆదేశం

నరసరావుపేట: ప్రతి పౌరుడు, విద్యార్థినీ విద్యార్థులకు రాజ్యాంగ పీఠిక, ప్రాథమిక విధులపై అవగాహన కల్పించే విధంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాలల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని మండల అధికారులు, ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వాటి ఎదుట నిలబడి ప్రతి ఒక్కరూ చదివేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థినీ విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రతిజ్ఞలు చేయించాలన్నారు. ఈ ప్రక్రియ వచ్చే ఏడాది జనవరి 26 అనంతరం కూడా నిరంతరం కొనసాగాలని ఆయన ఆదేశించారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో...

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై

ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 2వ తేదీన గుంటూరులో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www. sakshieducation. com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం అందరికీ తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత..

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్ 1,2 పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపగలరు.

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 2, 2023(శనివారం)

వేదిక: ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ (ఏసీ కాలేజీ), గవర్నమెంట్ ఆసుపత్రి పక్కన, సాంబశివ పేట, మెయిన్ రోడ్ గుంటూరు

సమయం: ఉదయం 9.30 నుంచి 12.30 వరకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8977625795

ధ్యేయం.. వికసిత్ భారత్

- కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ మోనాలిసా డెస్
- వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేద్దాం



అధికారులతో సమీక్ష చేస్తున్న మోనాలిసా డెస్, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: దేశాన్ని 2047 నాటికి అన్ని రంగాలలో అభివృద్ధి చేసి వికసిత్ భారత్‌గా రూపొందించడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ మోనాలిసా డెస్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ ఎస్ఆర్ శంకర్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్‌తో కలసి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 60 రోజులపాటు జిల్లాలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజల చేత 'వికసిత్ భారత్ ప్రతిజ్ఞ' చేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను గ్రామస్థాయిలోని ప్రజలకు అవగాహన కలిగించడం, తద్వారా సంక్షేమ ఫలాలను పొందిన లబ్ధిదారులను కలిసి వారు పొందిన లబ్ధిని తెలుసుకోవడం, ఆ గ్రామంలో ఇంకా ఎవరైనా లబ్ధి పొందని వారు ఉంటే వారికి కూడా సంక్షేమ ఫలాలు అందేలా చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. కోవిడ్ సమయంలో గరీబ్ కల్యాణ యోజన కార్యక్రమం ద్వారా పేదలకు ఆహార భద్రత కల్పించామన్నారు. రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, నిరుపేదలకు పీఎం ఆవాస యోజన ద్వారా పక్కా గృహాలు, మహిళల సాధికారతకు పీఎం ఈజీపీ ద్వారా రుణాలు, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య బీమా కల్పిస్తున్నామన్నారు. ఆధునిక టెక్నాలజీ ఆర్టిఫిషిల్ ఇంటిలెజెన్స్ ద్వారా భూసార పరీక్షలు చేపట్టి రైతులకు అధిక దిగుబడి సాధనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీఆర్వో కె.వినాయకం, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమ్మెటివ్-1 పరీక్షలకు సర్వం సిద్ధం

28 నుంచి ప్రారంభం

యడ్లపాడు: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మదింపునకు విద్యా శాఖ ఏటా క్లాస్‌రూంబేస్డ్ (సీబీఏ), ఫార్మేటివ్(ఎఫ్ఏ), సమ్మేటివ్(ఎస్ఏ) అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 1–10 తరగతుల విద్యార్థులకు ఎస్ఏ–1 పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధమౌతోంది. ఈనెల 28 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు జరిగే పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) ప్రకటించింది. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) ద్వారా ఆయా పరీక్షా పత్రాలు ఇప్పటికే మండల కేంద్రాలకు సరఫరా అయ్యాయి.

సిలబస్ పూర్తి చేశాకనే పరీక్షలు

కె.శామ్యూల్, జిల్లా విద్యాశాఖ అధికారి పల్నాడు

28 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో దాదాపు మూడు లక్షలకు పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ సూచన మేరకు గత వారం రోజులుగా అన్ని పాఠశాలల్లో తరగతుల వారీగా పర్యవేక్షించాం. సిలబస్‌తోపాటు వర్క్, నోట్‌బుక్స్ కూడా పూర్తయ్యాయని నిర్ధారించుకున్నాకనే పరీక్షల నిర్వహణకు సిద్ధమయ్యాం.

ప్రావిజనల్ మెరిట్ జాబితా విడుదల

గుంటూరుమెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ద్వారా, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఈనెల 10న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా శనివారం విడుదల చేశామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 30వ తేదీలోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అందజేయాలని వెల్లడించారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

ఉత్తమ పర్యాటక గ్రామ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

నరసరావుపేట: ఉత్తమ పర్యాటక గ్రామ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారి బీజే బెన్నీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారసత్వ పర్యాటకం, వ్యవసాయ పర్యాటకం, కళాఖండాలు, బాధ్యాతాయుత పర్యాటకం, కమ్యూనిటీ ఆధారితం, వెల్‌నెస్ రంగాలకు సంబంధించి ఆ రంగాల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన బెస్ట్ టూరిజం వెలనెస్‌ను రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పురస్కారాలు అందజేస్తారన్నారు. ఇతర వివరాలకు 79950 86775, 95534 36612లను సంప్రదించాలని కోరారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2000, గరిష్ట ధర రూ.3100, మోడల్ ధర రూ.2500 వరకు పలికింది.

క్లుప్తంగా

ఏపీ జేఏసీ మహిళా విభాగం జిల్లా నూతన కార్యవర్గం



నరసరావుపేట: జిల్లా ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగ చైర్‌పర్సన్‌గా డెప్యూటీ తహసీల్దార్ అనూరాధ, ప్రధాన కార్యదర్శిగా పద్మావతి ఎన్నికయ్యారు. ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యవర్గ ఎన్నికకు జిల్లా చైర్మన్ మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తిరుమలరావు అధ్యక్షత వహించారు. వివిధ డిపార్టుమెంట్లకు చెందిన మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ మల్లేశ్వరరావు, రాష్ట్ర మహిళా విభాగ చైర్‌పర్సన్ పి.లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, అసోసియేట్ చైర్మన్ శివకుమారిరెడ్డి, కో–చైర్మన్ రత్నకుమారి పాల్గొన్నారు.

17 మంది సంగం డెయిరీ ఉద్యోగులు, సిబ్బందిపై కేసు

పోలీసులపై దౌర్జన్యం చేసిన ఘటన

చేబ్రోలు: మండల పరిధిలోని వడ్లమూడి సంగం డెయిరీ వద్ద పోలీసులపై దౌర్జన్యం చేసి, విధులకు ఆటంకం కలిగించిన 17 మంది ఉద్యోగులు, సిబ్బందిపై పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. ఏలూరు జిల్లా పాడి రైతుల ఫిర్యాదుపై విచారణ నిమిత్తం పొన్నూరు రూరల్ సీఐ, ఎస్ఐ, చేబ్రోలు ఎస్ఐ, సిబ్బంది శుక్రవారం డెయిరీ వద్దకు వెళ్లారు. అక్కడ పోలీసులను లోపలకు రాకుండా సంగం డెయిరీ ముగ్గురు డైరెక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది అడ్డుకున్నారు. పోలీసులను అడ్డుకోవటంతో పాటు, దౌర్జన్యం చేసి, విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు డైరెక్టర్లు, సెక్యూరిటీ ఎస్వో, ఉద్యోగులు మొత్తం 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.ఆనంద్ తెలిపారు.

జాతీయ అదాలత్‌ను జయప్రదం చేయండి

న్యాయమూర్తి ప్రవల్లిక

నరసరావుపేట టౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి టి.ప్రవల్లిక కోరారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం డివిజన్‌లోని పోలీస్ అధికారులతో కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే దిశగా పోలీస్ అధికారులు కృషి చేయాలన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించబడతాయని చెప్పారు. అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకొని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు అశోక్ కుమార్, వీరేంద్రబాబు, రూరల్ సీఐ కృష్ణయ్య, ఎస్ఐలు రహంతుల్లా, రాజానాయక్, రోశయ్య పాల్గొన్నారు.



పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న న్యాయమూర్తి ప్రవల్లిక

సబ్‌జైలు సందర్శన..

ఖైదీలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని న్యాయమూర్తి టి.ప్రవల్లిక ఆదేశించారు. శనివారం సబ్ జైలును సందర్శించిన ఆమె ఖైదీలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదుల్ని ఏర్పాటు చేసుకోలేని పేదలు ఎవరైనా ఉంటే మండల న్యాయ సహాయక కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సబ్ జైలర్ రవి కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి

డీఈఓ శామ్యూల్

నరసరావుపేట ఈస్ట్: ఎన్ఎంఎంఎస్ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం హార్డ్ పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ మోడల్ గ్రాండ్ టెస్ట్ శనివారం నిర్వహించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఏటా రూ.12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం లభిస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,078 మంది విద్యార్థులను స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేస్తారని వివరించారు. డిసెంబర్ 3వ తేదీన డివిజన్ కేంద్రాలలో నిర్వహించనున్న పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని కోరారు. గత ఏడాది 8వ తరగతి చదివే విద్యార్థులు 3,404 మంది దరఖాస్తు చేసుకోగా ఈఏడాది 3,004 దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏఏ మధుకుమార్, పరీక్ష కో ఆర్డినేటర్లు బి.రాము, వి.ఒక్కిరెడ్డి, కె.వి.సుబ్బారెడ్డి, బి.సి హెచ్.రఘురామ్ పాల్గొన్నారు.



మోడల్ పరీక్ష విజేతలకు బహుమతి అందిస్తున్న డీఈఓ శామ్యూల్

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

నరసరావుపేట టౌన్: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.ఆశీర్వాదం పాల్ పిలుపునిచ్చారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏరియా వైద్యశాల్లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గతంతో పోల్చుకుంటే మరణాల సంఖ్య తగ్గిందన్నారు. దానికి కారణం ప్రజల్లో చైతన్యం రావటమే ముఖ్యకారణమన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్, డాక్టర్ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత ఎయిడ్స్ వ్యాధిపై ప్రభుత్వం విడుదల చేసిన పోస్టర్‌లను ఆవిష్కరించారు.



ఎయిడ్స్ వ్యాధిపై ప్రచురించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్, సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ
నరసరావుపేట, పల్నాడు జిల్లా
పత్రికా ప్రకటన

జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత కార్యాలయము, నరసరావుపేట, పల్నాడు జిల్లా నందు ఖాళీగాయున్న 12 పోస్టులు జిల్లా బాలల సంరక్షణ యూనిట్ (DCPU) నందు, 11 (only for Women) శిశు సంరక్షణ కేంద్రము (SAA) నందు మరియు పిడుగురాళ్ళలోని చిల్డ్రన్ హోమ్ నందు 08 (only for Women) పోస్టులు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ మరియు పార్ట్ టైమ్ పద్ధతిన భర్తీ చేయుటకు తేది: 01.07.2023 నాటికి 18–42 సం॥లలోపు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించడమైనది.

ఆసక్తి గల అభ్యర్థులు డిస్ట్రిక్ట్ వెబ్‌సైటు (httpp://palnadu.ap.gov.in/ మరియు https://wdcw.ap.gov.in./) నుండి దరఖాస్తును (Application form) డౌన్‌లోడ్ చేసుకొని టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (TOR) ప్రకారం పూర్తి చేసి అన్నీ ధృవ పత్రాల నకళ్ళు జత చేసి ది.25.11.2023 నుండి 13.12.2023 లోపల కార్యాలయ పని దినములలో (సాయంత్రం 5.00 గంటల లోపు) జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారిత అధికారి, చాకిరాల మిట్ట, బరంపేట, నరసరావుపేట, పల్నాడు జిల్లా, పిన్‌కోడ్ 522601 వారికి సమర్పించవలెను.

జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారిత అధికారి నరసరావుపేట, పల్నాడు జిల్లా.	Sd/-XXXX కలెక్టరు మరియు జిల్లా మెజిస్ట్రేట్/ చైర్మన్ నరసరావుపేట, పల్నాడు జిల్లా.

పల్నాటి వీరుల ఆయుధాలకు పునః ప్రతిష్ట

కారెంపూడి: పల్నాటి వీరుల ఆయుధాలకు పునః ప్రతిష్టా కార్యక్రమం స్థానిక పల్నాటి చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించారు. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ పల్నాటి వీరుల ఆయుధాలకు చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక క్రతువుల నిర్వహించిన అనంతరం పునః ప్రతిష్ట చేశారు. ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం గంగవరం గ్రామానికి చెందిన గడిబోయిన వెంకయ్య, గడిపూడి నరేంద్ర మరో పది మంది పల్నాటి వీరాచారవంతులు తమ పూర్వీకుల ద్వారా సంక్రమించిన పల్నాటి వీరుల ఆయుధాలకు మరమ్మతులు చేయించుకున్న అనంతరం వాటి పవిత్రత దెబ్బతినకుండా ఆయుధాలను చెన్నకేశవస్వామి సమక్షంలో పీఠాధిపతి చేతుల మీదగా పునః ప్రతిష్ట చేయించుకున్నారు. పునః ప్రతిష్ట చేయించుకున్న ఆయుధాలతో వీరాచారవంతులు పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పోతురాజుకు పడిగెం

కారెంపూడి: కార్తిక పౌర్ణమి ఆదివారం రాత్రి స్థానిక పల్నాటి వీరుల గుడిలో పోతురాజు శిలకు పడిగెం కట్టే కార్యక్రమం నిర్వహించనున్నట్లు పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ శనివారం తెలిపారు. రాత్రి 11 గంటలకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. చెన్నకేశవస్వామి సన్నిధిలో ఉన్న బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహ కుంతాన్ని వెలుపలికి తీసి పూజాదికాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి సూరేశ్వరస్వామి దేవాలయ ముఖ ద్వార జ్వాల తోరణం పూర్తయిన అనంతరం బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతంతో ఊరేగింపుగా వీరుల గుడికి చేరుకుని పోతురాజుకు పడిగెం కట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతం, పల్నాటి చెన్నకేశవుని వీరాచార పీఠం సమక్షంలో వీరుల గుడి పూజారులు పీఠాధిపతి ఆధ్వర్యంలో పోతురాజుకు పడిగెం కడతారన్నారు. ఉత్సవాలు ముగిసేంత వరకు రణక్షేత్రంలో ఉన్న వీరుల గుడి ప్రాంగణాన్ని వీడవద్దని బ్రహ్మనాయుడు పోతురాజుకు ఆన పెట్టినట్లుగా ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. పడిగెం కట్టిన తర్వాత రోజు నుంచి వీరారాధన ఉత్సవ ఏర్పాట్లు జరుగుతాయని, కార్తిక అమావాస్య డిసెంబర్ 12 నుంచి ఐదు రోజుల పాటు పల్నాటి వీరుల స్మరణ కొనసాగుతుందని వివరించారు.



చెన్నకేశవస్వామి గుడి ఆవరణలో పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవతో వీరాచారవంతులు

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రేమసాగర్ విజయదుందుబి

రాష్ట్రస్థాయిలో సిల్వర్, స్కూల్ గేమ్స్‌లో బంగారు పతకం కైవసం

చీరాల రూరల్: రాష్ట్రస్థాయిలో సిల్వర్, స్కూల్ గేమ్స్‌లో బంగారు పతకాలు సాధించి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్నాడు ప్రేమసాగర్. చీరాల మండలం సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రవీణ్ కుమార్ కుమారుడు దేవరకొండ ప్రేమసాగర్ వెయిట్ లిఫ్టింగ్‌లో తనదైన శైలిలో దూసుకుపోతున్నాడు. తాజాగా రాష్ట్ర స్థాయిలో, స్కూల్ గేమ్స్‌లో పాల్గొని సత్తాచాటి పతకాలు కైవసం చేసుకున్నాడు. ఈనెల 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేటలో ఏపీ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో అండర్–19 యూత్ 81 కేజీల విభాగంలో పాల్గొన్న ప్రేమసాగర్ 274 కేజీల బరువులు ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. అలానే నాలుగు రోజుల వ్యవధిలో ఈనెల 23, 24, 25 తేదీల్లో కర్నూలులో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ప్రేమసాగర్ 261 కేజీల బరువులు ఎత్తి మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. అయితే ప్రేమసాగర్ ఐటీఐ (ఫిట్టర్) రెండో ఏడాది చదువుతుండడంతో స్కూల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు పోటీల నిర్వాహకులు అనుమతులు ఇవ్వలేదు.



బంగారు పతకం సాధించిన ప్రేమసాగర్



రాష్ట్రస్థాయిలో సిల్వర్ మెడల్ అందుకున్న ప్రేమసాగర్

హైకోర్టుకు వెళ్లి..

స్కూల్ గేమ్స్‌లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు మాత్రమే పాల్గొనాలనే నిబంధన ఉంది. పదో తరగతి తరువాత ఐటీఐ కోర్సు కూడా రెండేళ్లు కాబట్టి ఇంటర్మీడియెట్‌తో సమానమని అతని తండ్రి పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడైన ప్రవీణ్ కుమార్ హైకోర్టు ద్వారా ప్రేమసాగర్ స్కూల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు ఆర్డర్ పొందాడు. అదే ఆర్డర్‌తో పోటీల్లో పాల్గొన్న ప్రేమసాగర్ పోటీల్లో అన్ని విభాగాల్లో రాణించి బంగారు పతకం సాధించాడు. రాష్ట్రస్థాయి, స్కూల్ గేమ్స్‌లో విశేష ప్రతిభ కనబరచి పతకాలు సాధించిన ప్రేమసాగర్‌కు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ పున్నారావు, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడేటి వెంకట రామయ్య, అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ, కోచ్ దీనిష బాబు, క్రీడాభిమానులు, తోటి సహచరులు అభినందనలు తెలిపారు.

జిల్లా ఖోఖో జట్టు శిక్షణ పూర్తి

జే.పంగులూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టుకు ఖోఖో శిక్షణ శనివారంతో ముగిసింది. మండల పరిధిలోని స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో గత 20 రోజుల నుంచి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ ఎస్ఆర్ ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. శనివారం జట్టుకు శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ పంగులూరులో శిక్షణ తీసుకున్న జట్టు అండర్–14 విభాగంలో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులను వంకాయలపాడు గ్రామానికి చెందిన భవనం ప్రసన్నాంజనేయరెడ్డి, భవనం శ్రీమన్నారాయణరెడ్డి అందించారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భవనం కాశీవిశ్వనాథరెడ్డి, జిల్లా ట్రెజరర్ కె.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు..

ఎ.శ్రీనివాస్ (పంగులూరు), ఎం.కేశవ (పంగులూరు), జి.సందీప్ (కనిగిరి), కె.సాయి (కేవీ పాలెం), ఎస్. నాగచైతన్య (పంగులూరు), యు.ఆకాష్ (పంగులూరు), ఏ. నవనీత్ కుమార్‌రెడ్డి(కేవీ పాలెం), పి.వెంకటేశ్వర్లు (పంగులూరు), టి.మనోజ్ (కేవీ పాలెం), ఆర్. వెంకటేష్ (రుద్రవరం), ఏ మధుబాబు (పంగులూరు), కె.విష్ణువర్ధన్ (పంగులూరు), మోహన్‌కుమార్ (కేవీ పాలెం), నందకిషోర్(గంగవరం).

